

# కథ మొదలయ్యింది

ప్రతాప రవిశంకర్

ఐదుకెక్కవలసిన ట్రైను తొమ్మిదిన్నరే అయినా గుంటూరు నుంచి హైదరాబాద్ వెళ్ళే బస్సు పది నిముషాలు తక్కువ పది గంటలకు బయల్దేరింది.

చలికాలం వెళ్ళిపోయినా చలి పూర్తిగా వెళ్ళిపోలేదు. అంతకుముందే భోజనం చేసి ఉండటం వల్ల వేగంగా వెళుతున్న బస్సులో చలిగాలి నన్ను మరింత బాధించింది. విండో గ్లాసును మూశాను. బస్సు నిండుగా ఉన్నారు ప్రయాణీకులు.

ఊరు దాటగానే బస్సులో లైట్లు తీసేశాడు డ్రయివరు. నవలలు చదువుతున్న ఇద్దరు ముగ్గురు మనుషులు పుస్తకాలు మూసి నిద్ర పోయే ప్రయత్నాలు చేశారు.

ఏదో గొప్ప బాధ్యతాయుతమైన పని తనకు అప్పగించబడినట్లుగా బస్సు నడుపుతున్నాడు డ్రయివరు. నిటారుగా తన సీట్లో కూర్చుని దృష్టిని సూటిగా నిల్పుతున్నాడు రోడ్డు మీదకు. దాదాపు బస్సులో వారందరూ నిద్ర పోవటం కోసం ప్రయత్నాలు చేస్తున్నారు. నేను కూడా సర్దుకుని కూర్చుని కళ్ళు మూసుకున్నాను నిద్ర వస్తుందేమోనని...

నిద్ర రాలేదు—కళ్ళముందు శకుంతల రూపం కదలాడింది. మనసులో ఒక విధమయిన ఆరాటం బయల్దేరింది.

శకుంతల!

అందానికి ప్రతిరూపం! అందానికే డెఫినిషన్.

శకుంతలే హైదరాబాద్‌లో లేకుంటే ఉన్నట్లయితే విద్యాసాగర్ పెళ్ళికి వెళ్ళకుండా ఎగ్గొట్టే వాణ్ణి... ఇప్పుడు వాడి పెళ్ళికి వెళ్ళుతున్నానంటే ఇందుకు వాడు పరోక్షంగా శకుంతలకు థాంక్స్ చెప్పుకోవాలి.

ఏన్నాళ్ళ నుంచో శకుంతలను ఒక్కసారి చూడాలనే బలమైన కోర్కె విద్యాసాగర్ పెళ్ళి కార్డు చూడటంతో మరింత బలంగా తయారయింది. అప్పుడే నిర్ణయించుకున్నాను ఈ పెళ్ళికి వెళ్ళక తప్పదని.

"విద్యాసాగర్ మీకు అంత క్లోజ్ ఫ్రెండా?" అడిగింది అర్ధాంగి అరుణ వాడి పెళ్ళికి నేను వెళుతున్నానని చెప్పినప్పుడు...

"అవును... నేను వెళ్ళకపోతే వాడు తప్పకుండా ఫీలవుతాడు" అన్నాను మనసులో శకుంతలను తలుచుకుంటూ...

అసలు మధ్యాహ్నం కృష్ణా ఎక్స్‌ప్రెస్‌లో వెళ్ళాలనుకున్నాను... కాని లీవు దొరకలేదు. పెళ్ళి రేపు ఉదయం పదిన్నరకు—అందుకే ఈ రాత్రి బస్సుకు చివరిగా బయల్దేరాను.

బస్సు బాగానే వేగంగా వెడుతూంది. అయినా ఇంకా తొందరగా వెళితే బావుండుననిపించింది. ఎప్పుడెప్పుడు హైదరాబాద్‌లో వెళ్ళి పడతానా అని చాలా ఆత్రంగా ఉంది... శకుంతల ఎడ్రసు కాగితం నా షర్టు జేబులోనే ఉంది. అసలు ఆ కాగితం అనవసరం. ఎడ్రసు నాకు బాగానే గుర్తు ఉంది. అయినా మర్చిపోతానేమోనని భయం.

ఇప్పుడు శకుంతల ఏం చేస్తూ ఉంటుంది? భర్త కౌగిట్లో కరిగిపోతూ ఉంటుందా?

తన దురదృష్టాన్ని నిందించుకుంటూ విచార పడుతూ ఉంటుందా?

నిజంగా ఆమె జీవితం విషాదం...

అందం దేవుడిచ్చిన వరం... కాదనను... అంతమాత్రాన ఒక అందమైన మనిషి జీవితాన్ని మరో అందమైన మనిషే పంచుకోవాలని ఎక్కడా లేదు. ఒకవేళ అలా జరగనప్పుడు జీవితాంతం కుళ్ళి చావటం అవివేకం. జీవితంతో రాజీ పడి ముందుకు వెళ్ళటం తెలివి గల వాళ్ళ లక్షణం. అనుక్షణం జీవితాన్ని ద్వేషిస్తూ బతికే మనుషులంటే నాకు తగని జాలి..

ఇప్పుడు శకుంతల కూడా ఇదే పరిస్థితుల్లో ఉందని నా అనుమానం... అవునో, కాదో అక్కడికి వెళ్ళి ఆమెను కలుసుకుంటే గాని తెలీదు.

అందమైన శకుంతల పరిచయం కోసం, స్నేహం కోసం నేను పడిన శ్రమ, తపన తల్చుకుంటే ఇప్పుడు ఆశ్చర్యంగా ఉంటుంది నాకు. ఇంత తపనా పడిన వాడిని ఆమెను చేసుకోగలిగానా అంటే అదీ లేదు. అది నా దురదృష్టం. ఇందుకు ఎవ్వరూ బాధ్యులు కారు. అప్పటి నా పరిస్థితులే...

ఎంతో శ్రమ తీసుకుని శకుంతలతో పరిచయం చేసుకొనే ప్రయత్నంలో ఉండగానే శకుంతల తండ్రి ఆమెకు నేను లెక్కలు చెప్పవలసిందిగా మా నాన్నను అడగటం నాకు బాగానే ఆశ్చర్యాన్ని సంతోషాన్ని కలిగించింది. ఆయన



కళ్ళల్లో ఆశలు    ఫొటో—గురిందర్‌నాన్

మా నాన్నకు ప్రెండట...

ఇంతకంటే కావలసింది ఏముంది? సంతోషంగా ఒప్పుకున్నాను. నాకు బాగానే లెక్కలు వచ్చు... డిగ్రీ ఫస్ట్ ఇయర్‌లో ఉన్నాను... ఆమె ఇంటర్ చదువుతూంది.

ట్యూషన్ మొదలయింది. మొదటి రోజు శకుంతలకు ఏం చెప్పలేక పోయాను. శకుంతల ఒక్కసారి నా కళ్ళలోకి చూడగానే నా నోరు మూత పడిపోయింది. ఎంత ప్రయత్నం చేసినా పెదిమలు విచ్చుకోలేదు... ఆమె చూపులో అంత అందం ఉంది. అంత బలమూ ఉన్నది.

రెండో రోజు సాధ్యమయినంత వరకు ఆమె కళ్ళలోకి చూడకుండానే లెక్కలు చెప్పాను... రోజులు గడిచే కొద్దీ ఆమె దగ్గర నా సిగ్గు వదిలి పోయింది. స్వేచ్ఛగా మాట్లాడటం మొదలు పెట్టాను. ఆమె కూడా అంతే. ఆమె చూపులు నన్ను ఆరాధిస్తున్నట్టుగా ఉండేవి. లెక్కలు చెబుతున్నా నా వైపే చూస్తూ మౌనంగా కూర్చునేది.. అప్పుడప్పుడు శకుంతల ఒళ్ళు నాకు తగిలేది. కరెంటు షాక్ కొట్టినట్టు అనిపించేది. అప్పుడప్పుడు కావాలనే ఆమె చేతులు తాకేవాడిని... ఆమెలో ప్రతి అణువూ ఎంతో అందంగా కనిపించేది నాకు... ఆమె అందం నన్ను పరవశుడని చేసేది... ఆమెకు ట్యూషన్ చెప్పవలసి రావటం నా అదృష్టంగా భావించే వాడిని.

కేవలం లెక్కలేకుండా ప్రేమ గురించి ఇద్దరం మాట్లాడుకునే వరకు వచ్చాము..

ఆమెకు నేనంటే ఇష్టం. శకుంతలంటే నాకు ఇష్టం...

శకుంతల ఇంటర్ పాసయింది. నాకు థాంక్స్ చెప్పింది ఆ రోజున ఆమెను నాతో సినిమాకు రమ్మన్నాను... వచ్చింది. ఇద్దరం పక్క పక్కనే కూర్చున్నాము. ఏవేవో విషయాల గురించి మాట్లాడుకున్నాము. నే నయితే అసలు సినిమా చూడలేదు. చిన్నగా ఆమెతో మాట్లాడడమే సరిపోయింది ఆమె అందం చూస్తూ.

"డిగ్రీలో చేరతావా?" అడిగాను...

"నాకు చదవాలనే ఉంది. కాని చదివించే శక్తి నాన్నకు లేదు.

"అయితే ఏం చేస్తావ్?"

"నేను చేసేదేముంది? వాళ్ళు చేస్తారు. పెళ్ళి" చిన్నగా నవ్వుతూ అన్నది.

"అప్పుడే పెళ్ళా?" ఆశ్చర్యంగా అడిగాను.

"మీ రలాగే అంటారు... మా ఇంట్లో నాకు ఎప్పటి నుంచో సంబంధాలు చూస్తున్నారు. ఇంటర్ అయిపోగానే పెళ్ళి చేయాలని మా నాన్న ఎప్పుడో అన్నాడు. బహుశా త్వరలోనే ఏదో ఒక సంబంధం కుదరొచ్చు." నా కళ్ళలోకి చూస్తూ అన్నది శకుంతల...

మాట్లాడలేదు. నా గుండెలో ఏదో అలజడి మొదలయింది...

శకుంతల మరో వ్యక్తిని పెళ్ళి చేసుకుంటే నేను భరించగలనా? రెండు నెలలు గడిచాయి.

ఒక రోజు చీకటి పడుతున్న వేళ శకుంతల దగ్గరకు వెళ్ళాను ... డాబా మీద ఉంది. చాప మీద పడుకుని అప్పటికే ఉదయించిన చంద్రుడిని చూస్తూంది. నన్ను చూడగానే లేచి కూర్చుంది. ఆమె ఎదురుగా చాప మీద కూర్చున్నాను.

"నేనే మిమ్మల్ని కలవాలనుకున్నాను రేపు' అన్నది చిన్నగా.

"ఎందుకు? ఏదయినా పనుందా?

"ఒక విషయం చెప్పటానికి...

"ఏమి టా విషయం?

"ముందు నాకు ఈ మాట చెప్పండి... మీరు నన్ను ప్రేమించారా?

"ఎందుకొచ్చిందా అనుమానం?



ఆలోచనామృతం ఫోటో—గురిందర్ మాన్

"అనుమానం కాదు—నాకు సంబంధం కుదిరింది. నిజంగా మీరు నన్ను ప్రేమిస్తే నేను మీకు కావాలనుకుంటే మీరు నన్ను ఇప్పుడు పెళ్ళి చేసుకోగలరా?

ఆలోచనలో పడ్డాను.

"ఏమి టాలోచిస్తున్నారు?"

"నువ్వు నా దానివి కావటం కంటే నేను కోరుకునేది ఏదీ లేదు. కాని ఇప్పుడే పెళ్ళి చేసుకోమంటే ఎట్లా? ఇంకా చదువు పూర్తి కాలేదు. ఇంకో ఏడాది వరకు నీ పెళ్ళిని వాయిదా వేయించలేవా?"

"చాలా కష్టమండీ— అది నా చేతుల్లో లేదు... ఇప్పటికే నా పెళ్ళి ఆలస్యమయిందిట— మా అక్క పెళ్ళి నాకంటే చిన్న వయసులో జరిగిందట."

"మన దురదృష్టం" అన్నాను.

"అంతేనంటారా?"

"అవును... మనం ఇలా విడిపోవలసిందే. ఏడాది వరకు నీ పెళ్ళి ఆగదు. ఇప్పుడే నా పెళ్ళి జరగదు."

ఇలా అన్నప్పుడు శకుంతల కళ్ళలో నీళ్ళు తిరిగాయి. ఈ సంభాషణ తరవాత శకుంతల ఎదురుగా కూర్చోలేక పోయాను. ఇక ఎంతసేపు మాట్లాడుకున్నా బాధ, గుండె కోత తప్పించి మిగిలేది ఏదీ ఉండదు.

వచ్చేశాను...

ఆ తరవాత కొద్ది రోజులకే శకుంతల పెళ్ళి అయింది మరో ...ళ్ళో. నేను వెళ్ళలేను...అమ్మ వెళ్ళింది... వెళ్ళొచ్చి ఎంతో బాధ పడింది బంగారమంటి పిల్లను కోతికిచ్చి చేశారని. శకుంతల మొగుడు చాలా అసహ్యంగా ఉంటాడట. కానీ కట్నం లేకుండా చేసుకున్నాడట.

"గతి లేక చెయ్యటమేగానీ,అతను ఆ అమ్మాయికి ఎదురు కట్నం ఇవ్వాలి" అన్నది అమ్మ.

నా గుండెను ఎవరో పిండినట్లనిపించింది. ఇంతకుమించిన రంపపు కోత ఇంకోటి ఏముంటుంది? అయినా తప్పదు. ఎట్లాగో రాజీ పడాలి. ఇది జీవితం.

తరవాత నేను మళ్ళీ శకుంతలను కలుసుకోలేదు.

చదువయిన మూడు నెల్లకే ఉద్యోగం వచ్చింది నాకు. ఆ తరవాత నాలుగు నెలలకే అరుణతో పెళ్ళి జరిగింది.

ఇప్పుడు శకుంతల హైదరాబాద్ ఉంటూంది. ఆమె భర్తకు రైల్వే ఉద్యోగం.

ఆమెను చూడాలని, మాట్లాడాలని నా మనసు తహతహలాడుతూంది. శకుంతల గురించి ఆలోచిస్తూనే నిద్రలోకి జారుకున్నాను . మెలకువ వచ్చే సరికి బస్సు హైదరాబాద్ నగరంలో పరుగు తీస్తూంది.

* * *

పెళ్ళి ఉదయమే అయిపోయినా సాయంత్రం వరకు ఆ ఇంటి నుంచి బయట పడటం కుదర్లేదు.

ఏడు గంటలు కావస్తుండగా శకుంతల ఇంటిని కనుక్కో గలిగాను... నా రాకతో బాగా ఆశ్చర్య పోయింది ఆమె. తలుపు తీసిన శకుంతలను చూడగానే నేను గుర్తు పట్టలేక పోయాను. అంతగా మారిపోయింది రూపం... ఆమెలో ఇదివరకటి అందం లేదు. సన్నగా, బలహీనంగా కనిపించింది. కళ్ళలో కాంతి లేమ— నా ఆలోచన నిజమే అయింది.

"రండి" అంటూ నవ్వుతూ లోపలకు ఆహ్వానించింది.

మూడు గదుల చిన్న ఇల్లు.

"ఆయన ఇంట్లో లేరా?" అడిగాను.

"లేరు—గంట క్రితమే' వెళ్ళారు. ఆయనకు నైట్ డ్యూటీ—రాత్రికి రారు."

"అలాగా!"

"మీ పెళ్ళికి రాలేక పోయాను, మీరు కార్డు పంపినా!"

"నువ్వు రావని నాకు తెలుసు."

"ఎలా?"

"సారీ... చెప్పలేను."

"పోన్లెండి. ఏమిటి విశేషాలు? మీ భార్య అందంగా ఉంటుందా?"

"నీ అంత అందంగా ఉండదు. అయినా ...ర్వాలేదు. మంచి ఆకర్షణ ఉంది."

"అదృష్టవంతులు."

నవ్వేను.

తరవాత ఏవో చాలా విషయాలు మాకు తెలిసిన వ్యక్తుల గురించి మాట్లాడుకున్నాము.

"ఇక నే వెళతాను" అన్నాను. అప్పటికే తొమ్మిదయింది.

"ఇప్పు డెక్కడికి వెళతారు? ఈ పూట మీరు ఇక్కడే భోజనం చెయ్యాలి" అన్నది.

"తప్పదా?"

"తప్పదు. చాలా ఏళ్ళ తరవాత కనుసుకున్నాం. ఒకప్పటి ప్రేమికులం. కలిసి భోజనం చేద్దాం" అన్నది.

సరేననక తప్పలేదు. నేను మొహమాట పడుతున్నానని మరీ మరీ వడ్డించింది శకుంతల.

భోజనాలయినాయి.

"ఇప్పుడు నాకెంతో తృప్తిగా ఉంది. జీవితాంతం మీతో ఇలాగే కలిసి భోజనం చెయ్యాలనుకున్నాను, మీరు నాకు లెక్కలు చెప్పే

తప్పుడు. ఏమిటో ఈ జీవితం?" నిర్లిప్తంగా నవ్వుతూ అన్నది.

ఆమె మొహంలోకి చూశాను. అంతటా విచారమే...

"ఇక నే సెలవు తీసుకుంటాను.

"సెలవా... ఇంత రాత్రి వేళ సెలవు ఇవ్వబడదు. ఈ పూట మీరు ఇక్కడే పడుకోవాలి. ముందు గదిలో మీకు పక్క వేస్తాను. కొంచెం సేపు కబుర్లు చెప్పుకుని పడుకోవచ్చు.."

ఆలోచించాను. నిజానికి నాకు ఆ రాత్రి ఒంటరిగా శకుంతల ఉన్న ఆ ఇంట్లో గడపటం ఇష్టం లేదు. ఆమె భర్తకు మరు రోజు ఈ విషయం తెలిస్తే ఎలా ఉంటుంది? అందుకే ఒప్పుకోలేదు.

"ఆయనకు మీరు వచ్చినట్లు అసలు చెప్పను లెండి... మీ పిచ్చిగాని అనుమానించే మనిషయితే ఈ మాత్రం దానికే అనుమానించవచ్చు" అన్నది.

అసలే జీవితంలో చాలా నష్టపోయి చీకట్లో బతుకుతున్నాననుకుంటున్న ఆమెను మరింత బాధ పెట్టడం ఇష్టం లేక ఆ రాత్రి అక్కడే పడుకోవటానికి సిద్ధమయ్యాను.

ముందు గదిలో పక్క వేసింది. పడుకున్నాను. ఇంకో గంటసేపు కబుర్లు చెప్పుకున్న తరవాత నేను నిద్రలోకి జారిపోయాను.

ఎంతసేపు నిద్రపోయానో ఒక రాత్రి వేళ ఎవరో నా పక్కనే కూర్చున్నట్లనిపించి మెలకువ వచ్చింది.

కళ్ళు తెరిచాను...

నా ముఖం మీదకు ఒరిగి నన్నే చూస్తున్న శకుంతల కనిపించింది.

"శకుంతలా!" లేవబోయాను.

"ప్లీజ్ కాదనకండి."

"నీకు మతి పోయిందా! నువ్వు ఎంత నీచమయిన పని చేస్తున్నావో తెలుసా?" ఆమె మొహంలోకి చూస్తూ అన్నాను.

నవ్వింది శకుంతల... "నీచమా?" మీ దృష్టిలో నీచం కావచ్చు. కాని నా దృష్టిలో కాదు. నేనూ మనిషినే. నాకూ కోరికలు ఉంటాయి. అవి తీర్చుకోవాలనే తపన నాకూ ఉంటుంది. మీకు తెలీదు. ఆయన కురూపి. నేనెంత అందంగా ఉంటానో ఆయనంత దారుణమయిన రూపం ఉన్న మనిషి. పైగా ఆయనకు ఇన్‌ఫీరియర్ ఫీలింగ్ ఎక్కువ. ఆయన సుఖపడుతున్నాడో లేదో గానీ నన్ను మాత్రం కొంచెం కూడా సుఖపెట్టలేక పోతున్నాడు. నేనేం చేసేది?? మిమ్మల్ని ఇన్నాళ్ళ తరవాత చూశాను. నాలో ఇప్పటి వరకూ దాగి ఉన్న అసంతృప్తి మరింతయింది. ఇక నేను భరించలేను. "ప్లీజ్, ఈ ఒక్కసారికి...".

నేనేం మాట్లాడగలను వెంటనే... శకుంతల ఆర్గ్యుమెంటు ఆమె దృష్టితో చూస్తే సబబుగానే ఉంది. కాని అది నిజంగా సరయిన దేనా?

"శకుంతలా... ఇది జీవితం. అన్నీ మనం అనుకున్నవే జరుగుతాయి. అటువంటప్పుడు మనం చెయ్యగలిగిందిఏమీలేదు. వాటిని మవునంగా భరించటం

...స్తుంది... నీ జీవితంలో [illegible] పోయింది. ఇప్పుడు నువ్వు చెయ్యగలిగింది ఏమీ లేదు. ఈ జన్మకు ఇంతే అని సరిపెట్టుకోవటమే. అయినా మనిషికి అందమే ముఖ్యమంటావా? ఆలోచించు."

నా మాటలు శకుంతల మీద పని చెయ్యలేదు.

"హుఁ... కబుర్లు ఎన్నయినా చెప్పొచ్చు. అనుభవించే వాళ్ళకే తెలుస్తుంది ఆ నరకం. మనసును సరిపెట్టుకోవటం అంత సులభం కాదనే విషయం మీకు తెలీదా? ఎందుకునన్నిలా మధ్య పెట్టాలని చూస్తారు? ఆ మాత్రం తెలీనిదాన్నా? వద్దు...



పనిలో ఎంతతృప్తో   ఫోటో—కె. ఎస్. ఎం. రావు

మీరింకేమీ చెప్పొద్దు... కనీసం మీరయినా నన్ను అర్థం చేసుకుంటారని అనుకున్నాను. నా దురదృష్టం... మీ కళ్ళకు నేను నీచమయిన దానిలాగే కనిపించాను." ఏడుస్తూ వెళ్ళిపోయింది గబగబా.

ఒకప్పటి అందమయిన శకుంతల. నా వూహా సుందరి... నా జీవన సర్వస్వం... ఈ రోజు నాకో అపూర్వమయిన అవకాశాన్ని ఇలా కలిగిస్తుందని... నేను దాన్ని నీతి కబుర్లతో కాలదన్నుకుంటానని కలలో అయినా వూహించానా?

అవును... ఇంతకుమించి శకుంతలను నేనేం చెయ్యలేను... ఎట్లాగో కళ్ళు మూసుకున్నాను. చాలా సేపటి వరకు శకుంతల ఏడుపు, ఎక్కిళ్ళు

...పిస్తూనే ఉన్నాయి.

పూర్తిగా తెల్లవారక ముందు నిద్రలేచి శకుంతలతో చెప్పి ఆ ఇంట్లో నించి భారమయిన హృదయంతో బయటపడ్డాను.

ఇంటికి వచ్చిన నాలుగు రోజులకు శకుంతల ఆఫీసుకు నా పేరున ఒక ఉత్తరం వ్రాసింది. అందులో ఆ రాత్రి అలా ప్రవర్తించినందుకు క్షమించమని రాసింది.

ఇప్పటికయినా తన మనసు మార్చుకుని హాయిగా భర్తతో కాపురం చెయ్యమని వెంటనే జవాబు రాశాను.

ఆ తర్వాత శకుంతల నించి ఉత్తరాలు అందు కోవటం గానీ రాయటంగానీ జరగలేదు.

చాలా రోజుల వరకు శకుంతల నా ఆలోచనల్లో నిలిచిపోయే ఉన్నది.


అయిదు నెలలు గడిచాయి.

మరిచిపోతున్నాననుకున్న జ్ఞాపకాలు, ఆలోచనలు ఒక్కసారి గుప్పుమన్నాయి.

శర్మ మా ఆఫీసుకు హైదరాబాద్ నుంచి ట్రాన్స్‌ఫర్ అయి వచ్చాడు. అతనిది మంచి రూపం. హీరోలా ఉంటాడు. ఎప్పుడూ అతని పెదవుల మీద చిరునవ్వు ఉంటుంది.

చాలా తక్కువ వ్యవధిలోనే మే మిద్దరం స్నేహితులుగా మారిపోయాము.

ఒక రోజు లంచ్ టైమ్‌లో మేమిద్దరం బయ




టకు వెళ్ళలేదు. లోపలే కబుర్లు చెప్పుకుంటూ కూర్చున్నాము.

ఆఫీసు ప్యూన్‌ని పిలిచాడు శర్మ. వాడు రాగానే పర్సు తెరిచి అయిదు రూపాయల నోటు తీసి మా ఇద్దరికీ టిఫిన్ కాఫీ తీసుకురమ్మని చెప్పాడు.

అతనలా పర్సు తెరిచినప్పుడు అప్రయత్నంగానే అతని పర్సులో ఉన్న ఆ ఫోటోను చూశాను. నిర్ఘాంతపోయాను. అది మరెవరి ఫోటోనో కాదు.

శకుంతల ఫోటో.

ఆమె ఫోటో శర్మ దగ్గర ఎందుకు ఉంది? ఎలా వచ్చిం దసలు?

ప్యూన్ వెళ్ళిపోయాడు.

"ఈ ఫోటో ఎవరిది? నీ మిసెస్‌దా?" చటుక్కున అడిగాను.

నవ్వేడు శర్మ. అతని నవ్వులో అదో రకమైన విషాదం కనిపించింది.

"కాదు."

"మరెవరిది?"

"ఈమె పేరు శకుంతల. నా స్నేహితుడి భార్య."

"ఆమె ఫోటో నీ దగ్గర ..."

"చెప్పుకోవటం బాగుండదు. అయినా చెబుతాను. ఈమె చాలా అందమయినది ఈ ఫోటోలో కంటే ... కాని బాడ్ లక్ ... ఈమె భర్త అంటే—నా ఫ్రెండ్ చాలా అగ్లీ ఫెలో. ఆమె అతన్ని ఎలా చేసుకున్నదో అర్థం కాలేదు. తర్వాత తెలిసింది. ఆమె ఇష్టంతో ప్రమేయం లేకుండా జరిగిందట ఆమె పెళ్ళి. కాకి ముక్కుకు దొండపండు. ఆమె గురించి చాలా జాలిపడ్డాను. అప్పుడప్పుడు ఫ్రెండ్‌కోసం వాళ్ళ ఇంటికి వెళ్ళే వాడిని. అలా వెళ్ళినప్పుడల్లా ఆమె అదోలా చూసేది. ఆ చూపులను అర్థం చేసుకున్నాను. కాని ఫ్రెండ్ భార్య. సంశయించాను. ఒక రోజు వీలు చేసుకుని ఆమె అంతా రాసి ఇచ్చింది ఓ కథలా. చదువుకున్న తర్వాత మరింత జాలికలిగింది. లొంగిపోయాను. తర్వాత గ్రహించాను. ఆమెకు తన తల్లిదండ్రుల మీద అంతులేని కసి. తన జీవితం అలా కావటానికి వాళ్ళే కారణమని ఆమె నమ్మకం. వాళ్ళమీద కోపం ఇలా నాతో సంబంధం ఏర్పరచుకుంది. నేనూ ఆమె అందానికి తలవంచాను. మా సంబంధం కొన్నాళ్ళు బాగానే రహస్యంగా సాగింది. నిజంగా ఆమెతో స్వర్గమే అనుభవించాను. కాని — ఒక రోజు మేమిద్దరం గదిలో ఉండగా ఫ్రెండ్ వచ్చాడు. నేను వేరే దారిలేక అతన్ని కొట్టి బయటకు పరుగుతీశాను. అతను కోపంతో ఫ్లవర్ వాజు తీసుకుని శకుంతల మీదకు విసిరాడు ఆమె. తల పగిలింది. హాస్పిటల్‌లో చేర్చారు. ఆ రాత్రికే ఆమె చనిపోయింది."

షాక్ ... షాక్ ...

శకుంతల చనిపోయిందా? ఒక్క క్షణం నాకేమీ అర్థం కాలేదు.

శకుంతలా! మనసులో విలపించాను. అప్రయత్నంగా నా కళ్ళలో నీళ్ళు తిరిగాయి.

"ఈ సంఘటన తరాత ఇక అక్కడ ఉండలేక పోయాను. అందుకే ఇక్కడకు ట్రాన్స్‌ఫర్ చేయించుకుని వచ్చేశాను."

శర్మ కళ్ళల్లో కూడా నీళ్ళు వచ్చాయి.

విచిత్రం ... శకుంతల జీవితం ఇలా అంత మవుతుందని తను కూడా కలలో అయినా అనుకుని ఉండదు. కాని జీవితానికి ఎదురు తిరిగి పోరాడాలనుకుంటే ఏమవుతుందో తెలిసింది.

"శర్మా ... శకుంతలా, నేనూ ఒకప్పటి ప్రేమికులం" గబుక్కున అన్నాను.

"వ్హాట్!" అదిరి పడ్డాడు శర్మ.

"అవును, ఈ రోజు ఆమె జీవితం ఇలా కావటానికి నేనే కారణం."

"ఎలా?"

శకుంతల కథ మొదలయింది. *

వెలువడింది! వెలువడింది!

ప్రచురణకి పూర్వమే 8000 కాపీలు అమ్ముడయి తెలుగు ప్రచురణరంగంలో నూతనాధ్యాయం సృష్టించిన నవల!

ఎమెస్కో సంస్థ ప్రత్యేక ప్రచురణ

యద్దనపూడి సులోచనారాణి సరికొత్త నవల

శ్వేత గులాబి

వెల: 12 రూ.

30-4-'80 లోపు ఏ పుస్తకాల షాపులో కొన్నా 11 రూ.లకే!
పోస్టులో తెప్పించుకోవాలంటే 10 రూ.లు M.O. చేయండి. 1 రూపాయకు వి.పి పెట్టి పంపుతాము!

ప్రతులకు: ఆంధ్రప్రదేశ్ బుక్ డిస్ట్రిబ్యూటర్స్ రాష్ట్రపతిరోడ్ సికిందరాబాద్-500 003

మీకుడి పక్కింటి అప్పారావు, ఎడమ పక్కింటి మీనాక్షి అప్పుచేసి అప్పుడే కొనేసారు. మరి మీరు ఆలస్యం చేయటం దేనికి?